




• గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, తదితరులు

దేశ అభ్యున్నతికి పాటుపడాలి

● అంబేద్కర్ జయంతి వేడుకల్లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 14: భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం స్ఫూర్తితో దేశ అభ్యున్నతికి పాటుపడాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పిలుపునిచ్చారు. అన్ని వర్గాల వారికి రాజ్యాంగ బద్ధంగా హక్కులు కల్పించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా నగరంలోని పూలాంగ్ చౌరస్తాలోగల అంబేద్కర్ విగ్రహానికి ఆదివారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు కిరణ్‌కుమార్, అంకిత్, నగర పాలక సంస్థ కమినర్ మకరంద్, ట్రైనీ ఐఏఎస్ కిరణ్మయి, వివిధ శాఖల అధికారులు, వివిధ సంఘాల నాయకులు, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అన్ని మతాల వారు సమానంగా అభివృద్ధి చెందాలని బాబాసాహెబ్ అంబేద్కర్ కన్న కలలను సాకారం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల శాఖ అధికారిణి శశికళ, నిజామాబాద్ ఆర్‌డీవో రాజేంద్రకుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఏడీ రమేష్, దళిత, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత ప్రతి పౌరుడిపై ఉంది..

: మాజీ మంత్రులు సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడి

అంబేద్కర్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రులు సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడ్డిలు పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జవహర్ లాల్ నెహ్రూ ప్ర ధా నిగా దేశప్రజలందరికి సమాన న్యాయం, సమాన హక్కు లభించాలని అంబేద్కర్‌కు రాజ్యాంగ నిర్మాణ బాధ్యతలు అప్పగించడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి మాట్లాడుతూ దేశం ప్రపంచ దేశాల్లో గుర్తింపు పొందిందంటే దానికి కారణం మన రాజ్యాంగమేనని అది అంబేద్కర్ నిర్మించిన రాజ్యాంగం వల్లే సాధ్యమైందన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలు, మహిళలు సామాజిక స్ఫూర్తితో జీవనం సాగిస్తున్నారని అది అంబేద్కర్ వల్లే అన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు, రత్నాకర్, డిల్లి, గోపి, సంతోష్, మీసాల సుధాకర్‌రావు, యాదగిరి, సుభాష్‌జాదవ్, పంచరెడ్డి చరణ్, చందు, ఆకుల సుజాత పాల్గొన్నారు.

వివిధ సంఘాల ఆధ్వర్యంలో..

అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు ఆదివారం నగరంలోని పూలాంగ్‌లోగల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం, టీఎస్‌యుటీఎఫ్ నాయకులు సత్యానంద్, మహామహానాడు నాయకులు నాగరాజు, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు, తపస్ ప్రతినిధులు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, ఏబీవీపీ నాయకులు, ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్, జిల్లా నాయకులు సిద్ధిరాములు, రాములు, ఏఐపీఎస్‌యూ నాయకులు అనిల్, సందీప్, ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

సమస్యల తిష్ఠ!

- కనీస వసతులు లేక పాఠకులకు తప్పని ఇక్కట్లు
- పాత పుస్తకాలతోనే కుస్తీ పడుతున్న నిరుద్యోగులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 14: జిల్లా కేంద్ర గ్రంథాలయం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. నిత్యం వందలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న గ్రంథాలయంలో అనేక సమస్యలు తిష్ఠ వేశాయి. దీంతో అరకొర వసతుల మధ్య అభ్యర్థులు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్నారు. గ్రంథాలయాల్లో అవసరమైన పుస్తకాలు లేక ఉద్యోగ సాధనలో నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావడానికి అప్‌డేట్ పుస్తకాలు అందుబాటులో లేకపోవడంతో అభ్యర్థులు పాత పుస్తకాలతోనే కుస్తీ పడుతున్నారు. గ్రంథాలయంలో ఫ్యాన్‌లు కూడా సరిపడా లేకపోవడంతో వేసవిలో అభ్యర్థులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గత పాలక వర్గం సమయంలో గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకుందని దానికి మరమ్మతులు చేయాలని తీర్మానించినప్పటికీ తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి బిల్లులు మంజూరు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. భవనంపై అంతస్తులో మొత్తం రేకులు వేయాల్సి ఉండగా.. ఒకచోట మాత్రమే రేకులు వేశారు. పాత సంప్ పూర్తిగా తొలగించి దాని స్థానంలో నూతనంగా సంప్‌ను నిర్మించాల్సి ఉన్నా దానిని రిపేర్ చేసినట్లు చూయించారు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికి గోడలన్నీ తేమ వచ్చి పెచ్చులూడి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితుల్లో జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉంది. దీనికి రిపేర్ల పేరుతో లక్షలాది రూపాయలు ఖర్చు చేయడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్లాబ్ వీక్‌గా ఉందని దానిపై పూర్తిగా రేకులు వేయాల్సి ఉండగా కొద్ది స్థలంలో మాత్రమే రేకులు వేశారు. ప్రస్తుతం ఉన్న భవనంలో సరిపడినన్ని రూములు లేక అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. కేవలం నాలుగు బాత్‌రూమ్‌లు మాత్రమే ఉండటంతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మరమ్మతుల పేరుతో ముందు భాగంలో రంగులు వేసిన కాంట్రాక్టర్ వెనక భాగంలో మాత్రం రంగులు వేయకుండానే వదిలేయడం విమర్శలకు తావిస్తుంది. గత పాలకవర్గం బిల్లుల మంజూరీలో అధికారులపై ఒత్తిడి తెచ్చి పనులు జరగకుండానే బిల్లులు కాంట్రాక్టర్‌కు మంజూరు చేసినట్లు తెలుస్తోంది.

గ్రంథాలయంలో అనేక సమస్యలు..

: నదీమ్, ఉద్యోగం కోసం సిద్ధమవుతున్న అభ్యర్థి



జిల్లా కేంద్రంలో ఉన్న గ్రంథాలయంలో అనేక సమస్యలు ఉన్నాయి. కూర్చునేందుకు స్థలం కూడా సరిపోవడం లేదు. బాత్‌రూమ్‌లు సక్రమంగా లేవు. ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేదు. పురాతన భవనం కావడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో భయంగా ఉద్యోగాలకు సిద్ధమయ్యే పరిస్థితి ఉంది.

సౌకర్యాలు కల్పించాలి..

: దినేష్, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థి



జిల్లా గ్రంథాలయంలో నెలకొన్న అనేక సమస్యలను పరిష్కరించాలి. ముఖ్యంగా ఫ్యాన్లు సరిపడినన్ని లేకపోవడంతో ఉక్కపోతతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. ఫ్యాన్‌ల గురించి అభ్యర్థుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు సౌకర్యాలు కల్పించాలి.



పెచ్చులూడుతున్న గ్రంథాలయ భవనం పైకప్పు

అరకొర వసతులు..

వందలాది మంది అభ్యర్థులు నిత్యం ఉద్యోగాల కోసం పుస్తకాలతో కుస్తీపడుతుంటే వారికి సమస్యలు కూడా అదే రకంగా స్వాగతం పలుకుతున్నాయి. జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం సమస్యలకు నిలయంగా మారింది. ఉద్యోగాల కోసం సరిపడా పుస్తకాలు లేకపోవడం పాత పుస్తకాలే ఉండటంతో ఉద్యోగాలకు సిద్ధమవడం కష్టంగా ఉందని అభ్యర్థులు చెబుతున్నారు. వేసవి కాలంలో ఫ్యాన్‌లు సైతం అంతంతమాత్రంగానే ఉండటంతో ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న వారి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు వారు చెబుతున్నారు. బాత్‌రూమ్‌లు సరిపడా లేవని సక్రమంగా క్లీన్ చేయడం లేదని అభ్యర్థులు వాపోతున్నారు. టీఎస్‌ఐడబ్ల్యూడీసీ అధికారులు మరమ్మతుల పనులను పర్యవేక్షించినప్పటికీ నిధుల దుర్వినియోగం విషయంలో 'ఆంధ్రజ్యోతి' అధికారుల వివరణ కోరేందుకు ప్రయత్నించినప్పటికీ ఫోన్‌లోకి అందుబాటులోకి రాలేదు. జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి సైతం ఫోన్‌లో అందుబాటులోకి రాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా గ్రంథాలయంలో నెలకొన్న పూర్తి సౌకర్యాలు కల్పించాలని పోటీ పరీక్షలు సిద్ధమవుతున్న అభ్యర్థులు కోరుతున్నారు.

పసుపు బోర్డు ఏర్పాటు చేయిస్తా..

● కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 14: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తాను చేసే మొట్టమొదటి పని జక్రాన్‌పల్లిలో పసుపుబోర్డు ఏర్పాటు చేయిస్తానని నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అర్గుల్ గ్రామంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి జీవన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వచ్చే ఖరీఫ్ పంటకు ధాన్యం రూ.500 బోనస్ ఇస్తామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ రైతులను పట్టించుకోవడంలేదని, కేంద్రంలో అధికారంలోకి రాగానే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించి ప్రజలను ఆదుకుంటామన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కాళేశ్వరం 21 ప్యాకేజీ పనులు చేపడతామన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. జక్రాన్‌పల్లి మండలం నుంచి పది వేల మెజారిటీ ఇవ్వాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కోరారు. అనంతరం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. నాలుగు నెలల్లోనే తెలంగాణలో రూ.30కోట్ల నిధులను ఆర్టీసీ బస్సుకు ఉచిత ప్రయాణం చేసి సద్వినియోగం చేసుకున్నారన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు రేషన్‌కార్డులు ఇవ్వలేదన్నారు. రూరల్ నియోజకవర్గంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వలేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒక్కటేనని, ఈ పార్టీలను ప్రజలు నమ్మవద్దన్నారు. ఎంపీ అర్వింద్ పసుపుబోర్డు తెస్తానని చెప్పి తేలేదని, ఎక్కడ పసుపుబోర్డు తెచ్చారో రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే బీసీ కులగణన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, అర్గుల్ ఎంపీటీసీ అనిత, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎం.సాయిరెడ్డి, యువజన మండల విభాగం అధ్యక్షుడు వినోద్, ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి పాల్గొన్నారు.



రసవత్తరంగా ఎన్నికల పోరు

- నియోజకవర్గంలో అభ్యర్థుల సుడిగాలి పర్యటనలు
- గెలుపు కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్న అభ్యర్థులు
- ప్రతీసారి భిన్నంగా పార్లమెంట్ నియోజకవర్గ ఓటర్ల తీర్పు

నిజామాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇందూరు పార్లమెంట్ ఎన్నికల పోరు రసవత్తరంగా కొనసాగుతోంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నుంచి ముగ్గురు రాజకీయ ఉద్దండులు పోటీ పడుతున్నారు. పార్లమెంట్ నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఎవరికి వారే మండలాల్లో పర్యటిస్తూ ఓటరు మద్దతును కూడగట్టే ప్రయత్నాలను చేస్తున్నారు. అభ్యర్థులు ప్రచారం కొనసాగిస్తుండగా ఇందూరు పార్లమెంట్ నియోజకవర్గంలో మాత్రం గెలుపు ఎవరిదనే చర్చ కొనసాగుతోంది. ముగ్గురు రాజకీయంగా పలుకుబడి ఉన్నవారే కావడం, ఆయా సామాజిక వర్గంలో బలమైన నేతలు అయి ఉండటం వల్ల ఈ దఫా గట్టి పోటీ ఉంటుందని భావిస్తున్నారు.

ఈనెల 18న ఎన్నికల నామినేషన్లకు నోటిఫికేషన్

పార్లమెంట్ ఎన్నికల నామినేషన్లకు ఇంకా ఆరు రోజులే సమయం ఉంది. ఈనెల 18న ఎన్నికల నామినేషన్లకు నోటిఫికేషన్‌లు ఇవ్వనున్నారు. ఆ రోజునుంచే నామినేషన్లను స్వీకరించనున్నారు. ఈనెల 25 వరకు నామినేషన్లను స్వీకరించి ఈనెల 26న పరిశీలన చేపడుతారు. ఈనెల 29న ఫైనల్ జాబితాను ప్రకటిస్తారు. ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం కాగా పోటీలో ఉన్న ముగ్గురు అభ్యర్థులు మాత్రం పార్లమెంట్ పరిధిలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఓటర్ల మద్దతును కూడగట్టుకునేందుకు ప్రయత్నాలను చేస్తున్నారు. ఈ ఎన్నికలు ముగ్గురికి కీలకంగా మారడంతో ఎవరికి వారే గట్టి ప్రయత్నాలను చేస్తున్నారు.

'పార్లమెంట్' పరిధిలో ప్రతీసారి భిన్నంగా ఓటర్ల తీర్పు

గోదావరి, మంజీరా నదుల తీరం ఉన్న ఇందూరు పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రతీసారి విభిన్నమైన తీర్పును ఓటర్లు ఇస్తున్నారు. మహారాష్ట్ర సరిహద్దుతో పాటు నిర్మల్, మంచిర్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల సరిహద్దు ఉన్న నియోజకవర్గంలో ఈ దఫా ముగ్గురు ఉద్దండులు పోటీ పడుతున్నారు. రాజకీయంగా వివిధ హోదాలు అనుభవించిన నేతలు మూడు పార్టీల నుంచి పోటీలో ఉండటంతో రసవత్తరంగా కొనసాగుతోంది. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. రాజకీయంగా నాలుగు దశాబ్దాల అనుభవం ఆయనకు ఉంది. శాసనసభకు 11 సార్లు పోటీ చేసిన ఆయన ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. రాష్ట్ర శాసనసభలో ప్రాతినిధ్యం వహించారు. రెండు దఫాలు క్యాబినెట్ మంత్రిగా పనిచేశారు. చివరగా ఆయన ఎంపీగా పోటీ పడుతున్నారు. గతంలో కూడా 2006, 2008లో కరీంనగర్ పార్లమెంట్‌కు జరిగిన ఉప ఎన్నికలో పోటీ చేసి ఓడిపోయారు. ఈ దఫా ఎలాగైనా ఎంపీగా గెలుపొందాలనే పట్టుదలతో ఆయన పోటీ పడుతున్నారు. అన్ని వర్గాలను, నేతలను కలుస్తూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

రాజకీయ భవిష్యత్తును కాపాడుకునేందుకు బాజిరెడ్డి యత్నం

బీఆర్ఎస్ తరఫున పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తన రాజకీయ భవిష్యత్తును కాపాడుకునేందుకు గట్టి ప్రయత్నాలను చేస్తున్నారు. శాసనసభకు ఆరు దఫాలు పోటీ చేసి నాలుగు దఫాలు గెలిచారు. రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్‌గా కూడా పనిచేశారు. పోలీస్ పటేల్ నుంచి రాజకీయం మొదలు పెట్టిన ఆయన నాలుగు దశాబ్దాలుగా వివిధ హోదాలో పనిచేశారు. పలు పదవులను నిర్వహించారు. ఈ దఫా ఎలాగైనా ఎంపీగా గెలవాలనే పట్టుదలతో ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో పర్యటిస్తూ మద్దతు కూడగట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. బీఆర్ఎస్ క్యాడర్‌తో పాటు ఇతర వర్గాలను కలుపుకొని ముందుకు పోతున్నారు. విభిన్నమైన తీర్పు ఇచ్చే ఇందూరు ఓటర్ల నాడిని పట్టుకుంటూనే ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

సిట్టింగ్ ఎంపీ అర్వింద్ రెండోదఫా పోటీ

గత ఎన్నికల్లో సీఎం కూతురిపై గెలిచిన సిట్టింగ్ ఎంపీ అర్వింద్ రెండోదఫా బీజేపీ నుంచి పోటీ పడుతున్నారు. ఇప్పటికే పలు దఫాలు నియోజకవర్గం చుట్టి వచ్చిన ఆయన విభిన్నమైన రీతిలో ప్రచారాలను కొనసాగిస్తున్నారు. పలు సంఘాలను కలుపుకొని ముందుకు పోతున్నారు. ఛాయితో చర్చ పేరుమీద మున్సిపాలిటీల పరిధిలో ప్రచారాలను నిర్వహిస్తున్నారు. వివిధ వర్గాలను కలుపుకొని గట్టి ప్రయత్నాలను చేస్తున్నారు. సీనియర్ నేతలను కలుపుకొని ముందుకు పోతున్నారు. దేశ వ్యాప్త రాజకీయాలకు అనుగుణంగా ఈ దఫా ఎలాగైనా సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ముగ్గురు సీనియర్ నేతల పోటీ

ఇందూరు పార్లమెంట్ పరిధిలో ముగ్గురు సీనియర్ నేతలు పోటీ పడుతుండటంతో రసవత్తరమైన చర్చ కొనసాగుతోంది. పార్లమెంట్ పరిధిలో యూత్ ఓటర్లు, మహిళ, రైతులు, వృద్ధుల ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. వీరినే టార్గెట్ చేస్తూ ముగ్గురు అభ్యర్థులు ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. భారీ బహిరంగ సభలు, రోడ్ షోలు లేకుండా జరుగుతున్న ఈ ప్రచారాలపై ఓటర్లలో విభిన్నమైన చర్చ కొనసాగుతోంది. ఈ దఫా ఎవరు గెలుస్తారో అనే అంశంపైనే ఎక్కువగా చర్చిస్తున్నారు. ఈ ఎన్నికలో బీజేపీ, బీఆర్ఎస్ తరఫున బీసీ అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇద్దరు అభ్యర్థులు కూడా మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందినవారే. కాంగ్రెస్ తరఫున రెడ్డి అభ్యర్థి బరిలో ఉన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ఉండగా గెలుపుపై మాత్రం ఈ చర్చ కొనసాగుతుంది. ఎవరికి వారే ఒక అంచనాకు వస్తూ ముగ్గురు అభ్యర్థులపై చర్చిస్తున్నారు. కొన్నిచోట్ల గెలుపు ఓటములపై బెట్టింగ్ కూడా కడుతున్నారు. ఎవరికి వారే అంచనాకు వస్తున్నారు. రాజకీయంగా ఉద్దండులు కావడంతో ఈ దఫా పోటీ ఎక్కువగా ఉండటంతో అంచనాకు రాలేకపోతున్నారు. ఆయా పార్టీల ప్రచారాల సరళిని పరిశీలిస్తున్నారు. ముగ్గురు అభ్యర్థులకు మద్దతుగా ఓటర్లు చర్చించుకుంటున్నారు.

నాళేశ్వర్ వాగు నుంచి భారీగా ఇసుక రవాణా

- చోద్యం చూస్తున్న సంబంధిత శాఖ అధికారులు

నవీపేట, ఏప్రిల్ 14: మండలంలోని నాళేశ్వర్ వాగు నుంచి ప్రతీ రోజు రాత్రి ఇసుక అక్రమ రవాణా భారీగా జరుగుతుంది. గ్రామంలో సుమారు 70 ట్రాక్టర్ల వరకు ఉండగా ప్రస్తుతం 20కి పైగా ట్రాక్టర్ల యాజమానులు ఒక్కొక్కరు స్థానిక వీడీసీకి 48వేల రూపాయల చొప్పున చెల్లించి ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారు. రాత్రి 9గంటల నుంచి ఉదయం 5గంటల వరకు స్థానిక నాళేశ్వర్, తల్వేద మధ్యనున్న వాగుల నుంచి ఇసుకను మండలంలోని వివిధ గ్రామాలతో పాటు నిజామాబాద్, నిర్మల్ జిల్లా బాసరకు అక్రమంగా తరలిస్తున్నారని పలువురు పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణా భారీగా జరుగుతున్నప్పటికీ అధికారులు తగిన చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేయడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇసుక అక్రమ రవాణాను అరికట్టి గ్రామంలో భూగర్భ జలాలు తగ్గిపోకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- **ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు : ఎస్సై యాదగిరిగౌడ్**


మండలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే సంబంధిత వాహనాలను సీజ్ చేయడంతో పాటు వాహన యాజమానులపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది. ఇటీవల నాళేశ్వర్ వాగు నుంచి అక్రమ రవాణా చేస్తున్న ఇసుక వాహనాలను పట్టుకోవడం జరిగింది.

- **ఇసుక ట్రాక్టర్ పట్టివేత**

మండలంలోని నాళేశ్వర్ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం రాత్రి పట్టుకోవడం జరిగిందని ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. నాళేశ్వర్ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని సమాచారం రావడంతో ట్రాక్టర్‌ను పట్టుకుని నవీపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించడం జరిగిందని ఎస్సై పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

ప్రజా సమస్యలపై రచనలు చేసే కవులు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్, 14: సమాజిక స్పృహ కలిగి ప్రజలను నిత్యం చైతన్యవంతులను చేస్తూ రచనలు చేసే కవులను ప్రజలు తమ మనసుల్లో భద్రంగా దాచుకుంటారని, కవులు సామాజిక బాధ్యతగా కవితారచనలు చేయాలని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందినిసిద్దారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పాంగ్రాలో జరిగిన జీవనసాఫల్య పురస్కార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "ఆలోచనల ఆవిష్కరణ" పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం నందిని సిద్దారెడ్డి మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా సాహిత్యం, తెలుగు సాహిత్యానికి ఎంతో సేవను, ఉద్యమ స్ఫూర్తిని అందించిందన్నారు. గోపరాజు, వంపకవి వంటి ప్రాచీన కవులు నడయాడిన ప్రాంతం అన్నారు. జిల్లాకు చెందిన ఈతరం కవులు కూడా తమ కర్తవ్యాన్ని గొప్పగా నిర్వర్తిస్తున్నారని, వారి రచనలు ఎందరినో ప్రభావితం చేస్తున్నాయని ఆయన ప్రశంసించారు. స్వర్ణ లక్ష్మణ రావు కవి వారసత్వాన్ని కొనసాగిస్తూ వారి కుమార్తె స్వర్ణ సమత సాహిత్యసేవచేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు డాక్టర్ నాశేశ్వరం శంకర్, దారం గంగాధర్, ఖైస దేవదాస్, విపి చందన్‌రావు, పెండోట వెంకటేశ్వర్లు, ఇందూరు జిల్లా బాల సాహిత్య వేదిక అధ్యక్షులు డాక్టర్ కాసర్ల నరేష్‌రావు, వెంకటేశ్వర్లు, ప్రవీణ్ శర్మ, రామగిరి సుజాత, రేణుక, పద్మజరెడ్డి, రమాదేవి దేశ్‌ముఖ్, ఉప్పు శ్రీవాణి, మాదవి తదితరులు పాల్గొన్నారు.





ఎంపీగా గెలిపిస్తే కేంద్ర నిధులు తెచ్చి అభివృద్ధి చేసి చూపిస్తా

● నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్


సమావేశంలో మాట్లాడుతున్న నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి

జక్రాన్‌పల్లి, ఏప్రిల్14: నిజామాబాద్ పార్లమెంట్ ఎంపీగా గెలిపిస్తే కేం ద్రంతో కోట్లడి నిధులు తెచ్చి నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఆదివారం జక్రాన్‌పల్లిలో గౌడ సంఘం ఫంక్షన్‌హాల్‌లో నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండల బీఆర్ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించా రు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ నిజామాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ హాజరై మాట్లాడుతూ కోట్లాడి తెలంగాణ రాష్ర్టాన్ని తెచ్చి బీఆర్ఎస్ పదేళ్ళ పాలనలో తెలంగాణ రాష్ర్టాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. వ్యవసాయ రంగానికి 24గంటల పాటు ఉచిత కరెంటు ఇచ్చారని, రైతులు సంతోషంగా పంటలు పండించుకున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో 50శాతం మంది రైతులు పండించిన ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు విక్రయించుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలేదని, అమలు కాని పథకాల గురించి బీఆర్ఎస్ కార్యకర్తలు ఇంటింటికి వెళ్ళి కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిక అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా లేరన్నారు. కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందన్నారు. బీఆర్ఎస్ గ్రాఫ్ 37శాతం పెరిగిందన్నారు. తాను ఎంపీగా గెలిస్తే కేంద్రంతో కోట్లడి పసుపు బోర్డును తీసుకువస్తానన్నారు. అన్ని వివర్గాల ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సీఎం రేవంత్‌రెడ్డికి వ చ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధిచెబుతారన్నారు. బీజేపీని ఓడించే సత్తా కేసీఆర్ బీఆర్ఎస్‌కు మాత్రమే ఉందన్నారు.ఎంపీగా గెలిపిస్తే కేంద్రంతో కోట్లడి నిధులు తెచ్చి నిజామాబాద్ పార్లమెంట్‌లో నియోజకవర్గాన్ని అన్ని విధాల విధాల అభివృద్ధి చేస్తానన్నారు. తన గెలుపు కోసం బీఆర్ఎస్ కా ర్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. పార్ల మెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు.అనంతరం మాజీఎమ్మెల్సీ వీజీ.గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి విద్యుత్‌ను సరఫరా చేయకపోవడంతో 15లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయయన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకుండా తుంగలో తొక్కిందన్నారు.ఇప్పటికీ రైతులకు ఏక కాలంలో రూ.2లక్షల రుణమా చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుంచాల విమల రాజు,జడ్పీటీసీ తనుజా శ్రీనివాస్‌రెడ్డి, వైసీఎం పీపీ తిరుపతిరెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు భోజన్న,మండల కోఆప్షన్‌సభ్యుడు, శ్రీనివాస్, మహేష్, ఎంపీటీసీలు పద్మ, మాజీసర్పంచ్‌లు బీఆర్ఎస్‌నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


అగ్నిప్రమాదాల నివారణ గురించి వివరిస్తున్న అధికారి



బాల్కొండలో అగ్నిమాపక వారోత్సవాలు పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్14: అనుకోకుండా అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు తీసుకోవాల్సిన జాగత్తల గురించి బోధన్ అగ్నిమాపక శాఖ అధికారి గంగాదాస్ పలు సూచనలు ఇచ్చారు. ఆదివారం అగ్ని మాపక వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో మృతి చెందిన అమరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అగ్ని మాపక వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 1994లో ముంబాయిలో విక్టోరియా డాగ్‌యార్డులో ఒక నౌక అగ్నిప్రమాదం సంభవించడంతో విధుల్లో ఉన్న 66 మంది అగ్నిమాపక శాఖ సిబ్బంది మృతి చెందారని పేర్కొన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు అధైర్యపడకుండా అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది శ్రీనివాస్, నర్సయ్య, హైమద్, అబ్దుల్ రషీద్, సాయిలు, రాజశేఖర్, మొసిన్ ఖాన్ తదితులు పాల్గొన్నారు.

భిల్లా: అగ్నిప్రమాదాలు సంభవించిన సమయంలో అగ్నిమాపక సిబ్బంది తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలను, ఆస్తులను కాపాడుతారని వారి సేవలు ఘననీయమని అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి జి.మురళీమనోహర్‌రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆయన అగ్నిమాపక శాఖ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అగ్నిప్రమాద నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి సిబ్బందికి వివరించారు. అగ్నిప్రమాదాల నివారణలో భాగంలో 1944 ఏప్రిల్ 14న ముంబాయి విక్టోరియా డాఖ్ యార్డులో మరణించిన 66 మంది సిబ్బందికి నివాళులర్పించారు. వారి జ్ఞాపకార్థం ప్రతి ఏడాది ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ అగ్నిమాపక శాఖ అధికారి వి.భానుప్రతాప్, నర్సింగ్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ మండల కేంద్రంలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించారు. వారం రోజుల పాటు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తారని, అగ్ని ప్రమాద నివారణ పద్ధతులను ప్రతీఒక్కరు పాటించి దేశ సంపదను కాపాడుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ డి.శేఖర్, టి.హరికృష్ణ, పీసీలు హన్మాన్‌చారి, నరేష్,డీఓపీ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయం 50వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు


ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం


పువ్వుల అలంకరించిన శ్రీరామచంద్రుడు

ముప్కాల్, ఏప్రిల్14: మండలంలోని రెంజర్ల గ్రామంలో శ్రీరామ నవమి పురస్కరించుకొని కోదండ రామ 50వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. మండల దీక్ష తీసుకున్న స్వాములు, ప్రధాన అర్చకులు నాగరాజు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు మొదటి రోజు అంగరంగా వైభవంగా శాస్త్రోక్తంగా అంకురారోహణ, దేవతహ్వాన, సాయంత్రం 6గంటలకు సహస్ర దీపాలంకరణ, 1000దీపాల నడుమ రామయ్య దర్శనమిచ్చారు. రెండవ రోజు సోమవారం హోమం, హన్మాన్ వాహనసేవ, మూడో రోజు మంగళవారం గరుడ వాహనసేవ, నాల్గవ రోజు బుధ వారం శ్రీరామ నవమి, 10.30నుంచి 12.30వరకు అభిజిత్ లగ్న మూహుర్తంలో సీతరామచంద్రస్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం 6గంటలకు సాయంత్రం రథోత్సవం రాత్రి 9.30సాంస్కృతిక కార్యక్రమం సంగీత్ దీపావళి నిర్వహించబడును. స్వామివారి కళ్యాణానికి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని రంగులతో వివిధ రంగుల పువ్వులతో, విద్యుత్ దీపాలతో చలువ పందిరి అలంకరించారు. 5న గురువారం ఉత్సవమూర్తులకు గోదావరిలో స్నానం చేయించి తొమ్మిదవ రోజు ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు భక్తుల అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఊరూర కొనసాగుతున్న హనుమాన్‌దీక్షలు

● నియమ నిష్టలతో అంజన్న పూజల్లో తరిస్తున్న భక్తులు ● వసతులు కల్పిస్తున్న ఆలయ కమిటీలు


యజ్ఞంలో పాల్గొన్న అంజన్న దీక్షపరులు


ఆలయ ప్రదక్షణలు చేస్తున్న అంజన్న దీక్షపరులు

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 14: మండలంలోని ప్రతీ గ్రామంలో హనుమాన్ దీక్షపరులతో అంజన్న ఆలయాలు కిటకిటలాడుతున్నాయి ప్రతీ రోజు నియమనిష్టలతో అంజన్న పూజలు, భజన కీర్తనల్లో అంజన్న భక్తులు తరిస్తున్నారు. ప్రతీఏటా దీక్షపరుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఉదయం, సాయంత్రం హనుమాన్ ఆలయాల్లో జైశ్రీరాం, జైహనుమాన్ శరణుఘోశ వినిపిస్తోంది. హనుమాన్ దీక్షలు చేపట్టినవారికి కష్టాలు దూరం కావడంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తోందని భక్తుల విశ్వాసం. నిత్యం రెండు పూటల ప్రత్యేక పూజలు, ఉపవాసాలు, కఠన నియమాలతో దీక్షలు కొనసాగుతాయి. దీక్షలుమూడు విడతలుగా హనుమాన్ దీక్షలు చేపడతారు. హనుమాన్ దీక్షలు 41, 21, 11 రోజుల పాటు మూడు విడతలుగా దీక్షలు తీసుకుంటారు. మార్చి నెల 14 నుంచి 41 రోజులు దీక్షలు ప్రారంభమవ్వగా ఏప్రిల్ 3 నుంచి 21 రోజులదీక్షలు, 13 నుంచి 11 రోజుల దీక్షలు ప్రారంభమయ్యాయి. అంజన్నకు ఆత్మనివేదన చేసుకుంటూ దీక్షలు కొనసాగిస్తున్నారు. ప్రతీరోజుల ఉదయం 3 నుంచి 6 గంటలలోపు స్నానాదుల ముగించుకుని సూర్యోదయానికి ముందే పూజలు ముగిస్తారు. సాయంత్రం అంజన్న ఆలయాలకు చేరుకుని చన్నీటి స్నానంచేసి పూజలు నిర్వహిస్తారు. దీక్షలు పూర్తైయ్యేవరు నేలపైనే నిద్రిస్తూ ఉల్లి, వెల్లుల్లి వాడని భోజనాలు చేస్తారు, భక్తులు కాషాయం, తెల్లటి దుస్తులు ధరిస్తారు. చెడు చూడడం, వినడం, మాట్లాడడం, కోపాన్ని ప్రదర్శిచడానికి దీక్షపరులు దూరంగా ఉంటారు. భక్తులు ప్రతీ నిత్యం శ్రీరామ..జయరామ.. జయరామ జయజయరామ అంటూ మంత్రాన్ని జపిస్తారు. హనుమాన్ దీక్షలో శ్రీరామ నవమి పర్వదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ సందర్భంగా గ్రామాల ప్రధాన వీధుల గుండా భజన సంకీర్తనలు ఆలపిస్తూ ఊరేగింపు నిర్వహిస్తారు. జగిత్యాల జిల్లా మల్యాల మండల పరిధిలోని కొండగట్టు అంజన్న ఆలయానికి భక్తులు కాలినడకనవెళ్లి మొక్కలు చెల్లించుకుంటారు. ఈ నెల 23న హనుమాన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని ముమ్మరంగా సాగుతున్నాయి.

అంజన్నదీక్షలతో మానసిక ప్రశాంత

అంజన్న దీక్షలతో మానసిక ప్రశాంతత లభిస్తుంది దీక్షలతో రోజువారి దినచర్యలో మార్పులు, దూవారధనలతో భక్తిభావం పెరుగుతుంది. చన్నీటిస్నానం, కటికనేలపై నిద్ర అరోగ్యకరం, దీక్షపరుల కోపతాపాలు దూరమై స్నేహభావం, గౌరవంభావం కలిగిస్తుంది. దేవచింతన కలుగుతుంది. సమయపాలన లభిస్తుంది. తానుగత 2006 నుండి అంజన్నదీక్షలు చేపడుతున్నాను ఈ ఏడాదితో 18 సంవత్సరాలుపూర్తిఅయ్యాయి. ఈ దీక్షలు నిరంతరం కొనసాగుతుందన్నారు.

- సుంకరి నవీన్ కుమార్ గురుస్వామి కమ్మర్‌పల్లి

కోడ్ కూసినా అమలు కాని నిబంధనలు

● గ్రామాల్లో విచ్చల విడిగా బెల్ట్ షాపులు

● కన్నెత్తి చూడని అధికారులు

రుద్రూరు, ఏప్రిల్ 14: పార్లమెంట్ ఎన్నికల కోడ్ కూసింది. నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంతో పాటు అక్బర్‌నగర్, అంబం తదితర గ్రామాల్లో కోడ్ నిబంధనలు అమలు కావడం లేదు. గ్రామాలలో విచ్చలవిడిగా వెలిసిన బెల్ట్ షాపుల్లో అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. యథేచ్ఛగా షాపులు నిర్వహిస్తున్న సంబంధిత అధికారులు మాముళ్లు తీసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం దుకాణదారులు గ్రామాలలో బెల్ట్ షాపుల నిర్వాహకులకు ప్రోత్సహిస్తూ మద్యం సరఫరా చేస్తున్నట్లు తెలుస్తుంది.

● విచ్చలవిడిగా బెల్టు షాపులు

రుద్రూరు మండల కేంద్రంతో పాటు అక్బర్‌నగర్, అంబం, ఆయా గ్రామ పంచాయితీల పరిధిలోని బెల్ట్ షాపులు ఒక్కో గ్రామంలో రెండు నుంచి ఐదు వరకు బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. కొన్ని గ్రామాలలో అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని మందుబాబులు మద్యం తాగి గ్రామాల్లో రెచ్చిపోతున్నారని బెల్ట్ షాపుల వల్ల పేద కుటుంబాలు రోడ్డు మీద పడుతున్నాయని మద్యానికి బానిసై గ్రామాల్లో గొడవలకు దారి తీస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

● అమలు కాని ఎన్నికల నిబంధన

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ మార్చి 16 నుంచి కోడ్ అమలులోకి వచ్చింది. అనుమతి ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లరాదని గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహించవద్దని మద్యం అమ్మకాలు చేయవద్దు అని ఈ నిబంధనలు తమకేమి పట్టనట్లు కొందరు గ్రామాల్లో యథేచ్ఛగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. ఎన్నికల్లో నిబంధనలు పకడ్బందీగా అమలు చేసిన ప్రస్తుతం ఇంకా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టడంలో అధికారులు దృష్టిసారించడం లేదు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎన్నికల నిబంధనల ప్రకారం గ్రామాల్లో అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీలో రజక సంఘాల సభ్యుల చేరిక


మోర్తాడ్‌లో సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన రజక సభ్యులు

మోర్తాడ్, ఏప్రిల్14: మండల కేంద్రంలోని ప్రజా భవన్‌లో ఆదివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ సమక్షంలో నాటి రజక సంఘ యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి వారికి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గిర్మాజీగోపి, పుప్పాల అశోక్, వీడీసీ అధ్యక్షుడు అశోక్, రామకృష్ణ, బాబు, రజక యువకులు పాల్గొన్నారు.

టీయూలో ఘనంగా జార్జిరెడ్డి వర్ధంతి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 14: తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఆదివారం ఉద్యమ స్ఫూర్తి నాయకుడు జార్జిరెడ్డి 52వ వర్ధంతి సందర్భరంగా పీడీఎస్‌యు ప్రతినిధులు జయంతి, ప్రిన్స్‌లు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు జార్జిరెడ్డి ఆశయసాధన కోసం ముందుకు సాగాలని ఉద్యమ స్ఫూర్తితో సమస్యలపై ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భర్తను హత్య చేసిన భార్య అరెస్టు

నవీపేట,ఏప్రిల్14: మండలంలోని జన్నేపల్లికి చెందిన మక్కల సాయిలు(45)ను గొంతు నులిమి హత్య చేసిన అతని భార్య రేఖను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. ప్రతిరోజు మద్యం సేవించి వేధిస్తుండడంతో శుక్రవారం తెల్లవారుజామున నిద్రలో ఉన్న సాయిలును భార్య రేఖ గొంతు నులిమి హత్య చేసిందని ఆయన పేర్కొన్నారు. సాయిలు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని నమ్మించడానికి ఆమె ప్రయత్నించిందని ఎస్ఐ తెలిపారు. మృతుడు సాయిలు మెడకు గాయాలు ఉండడంతో తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు విచారణ చేయగా సాయిలును తానే గొంతు నులిమి హత్య చేసినట్లు భార్య రేఖ అంగీకరించిందని ఎస్ఐ తెలిపారు. రేఖను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. మండలంలోని జన్నేపల్లిలో మక్కల సాయిలు ఈ నెల 12న హత్యకు గురైన విషయం విదితమే.

ప్రాణం తీసిన మూల మలుపు

మోస్రా,ఏప్రిల్14: మోస్రా మండల కేంద్రంలోని సాయిబాబా మందిరం వద్ద గల మూల మలుపు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మోస్రా గ్రామానికి చెందిన వ్యక్తి బైక్‌పై వెళ్తున్నప్పుడు పడిపోగా పెద్ద రాళ్ల తలకు బలంగా తగలడంతో అక్కడే ప్రాణం వదిలాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూల మలుపు వద్ద రేడియంతో కూడిన టర్నింగ్ బోర్డు ఏర్పాటు చేయాలని మరోసారి ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా అక్కడ సంబంధిత శాఖ అధికారులు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కోటగిరి,ఏప్రిల్14: పోతంగల్ మండలంలోని జల్లాపల్లి ఫారంకు చెందిన ఇస్లావత్ వినోద(30)అనే వివాహిత అదృశ్యమైనట్లు కోటగిరి ఏఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. వినోద ఈ నెల 10వ తేదిన కోటగిరి మండల కేంద్రంలో మార్కెట్ నిమిత్తం వచ్చి కనబడకుండా పోయింది. ఆమె ఆచూకీ కోసం బంధువులు ఇళ్లలో గాలించగా లభించలేదు. ఆమె భర్త సంతోష్ హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటున్నాడు. వినోద తల్లి బీమ్లిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

హనుమాన్‌స్వామిపై డాడి చేయడం సరికాదు

కోటగిరి,ఏప్రిల్14: జిల్లా కేంద్రంలో ఈ నెల 12వ తేదిన నరేష్ అనే హనుమాన్ స్వామిపై దాడి జరగడాన్ని అఖిల భారత శ్రీ హనుమాన్ దీక్ష బోధన్ డివిజన్ కన్వీనర్ శివ ప్రసాద్ ఖండించారు. కోటగిరి మండల కేంద్రంలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నరేష్ స్వామిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ స్వాములు సురేష్, వెంకాగౌడ్, సాయిలు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ సమాజ్ యువజన అధ్యక్షుడిగా సంతోష్

ఆర్మూర్‌టౌన్ , ఏప్రిల్14: క్షత్రియ సమాజ్ యువజన అధ్యక్షునిగా సాత్‌పూతే సంతోష్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సాత్‌పూతే తులసీదాస్ తెలిపారు. అధ్యక్ష ఎన్నికలలో నలుగురు పోటీ పడగా 59ఓట్ల మెజారిటీతో సాత్‌పూతే సంతోష్ ఎన్నిక కాగా కార్యదర్శులుగా 53కోట్ల మెజారిటీతో దుమని నీరజ్ గెలుపొందారు. దీంతో పలువురు వారిని పూలమాలలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్షత్రీయ సమాజ్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఖాందేశ్ శ్రీనివాస్, క్షత్రీయ సమాజ్ అధ్యక్షుడు అజారీ మధన్‌మోహన్, కార్యదర్శి బారడ్ గంగామోహన్, కర్తన్ హరినారాయణ, రవీందర్, శ్రీనివాస్, బారడ్ కిశోర్, జీవీ.ప్రశాంత్, మధుసూదన్, భూషణ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 14: ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993వ సంవత్సరంలో పదో తరగతి చదివి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకే వేదిక మీదికి చేరి సందడి చేసి, బాల్య స్మృతులను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజేందర్ రెడ్డి, బొబ్బిలి శంకర్, అంజాగౌడ్, విఠల్, విశ్వనాథ్, గంగా ప్రసాద్, హన్మాండ్లు, అబ్బరెడ్డి, ఆకుల కవిత, లతాశ్రీ, అనిత, సునీత తదితరులు ఉన్నారు.


జక్రాన్‌పల్లిలో..


అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే


నవీపేటలో..


బోధన్‌లో..


ధర్మారంలో..


కమ్మర్‌పల్లి ఎంపీపీ కార్యాలయంలో..

ఘనంగా అంబేద్కర్ జయంతి

● జిల్లావ్యాప్తంగా సంబరాలు ● పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు

జిల్లా వ్యాప్తంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. జిల్లాలోని మూడు డివిజన్ల పరిధిలో గల వివిధ మండల గ్రామాల్లోని ప్రజాపతినిధులు, అధికారులు, సంఘ సేవకులు, మేధావులు వివిధ సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వక్తలు మాట్లాడుతూ.. అంబేద్కర్ అపార మేధాశక్తితో సమాజంలోని రుగ్మతలను దూరం చేసేందుకు పాటుపడిన మహానీయుడని దళితుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసి సమాజంలోని అంటరానితనం, అసమానతలు రూపుమాపేందుకు కృషి చేసిన మహా వ్యక్తి అని అదనపు డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ వి.కోటేశ్వర్‌రావు అన్నారు. అలాగే నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. అంబేద్కర్ అందరివాడని అన్నారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో పీడీత ప్రజలు,బడుగు బలహీనవర్గాల ప్రజల అభ్యున్నతి కోసం రాజ్యాంగాన్ని అంబేద్కర్ రచించారని కొనియాడారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ.. నవభారత రాజ్యాంగా నిర్మాత ప్రపంచ దేశాలల రాజ్యాంగం కంటే ధృఢ రాజ్యాంగా కొనియాడారు.

● న్యూస్‌నెట్ వర్క్


అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోలీస్ సిబ్బంది


మోర్తాడ్‌లో..


టీయూలో ..


వేల్పూర్‌లో ..


అర్బన్ టీడీపీ ఆధ్వర్యంలో..


ఏర్గట్లలో ..


రుద్రూరులో..


రెంజల్‌లో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం


వర్నిలో..


మోస్రాలో ..


కోటగిరిలో ..


ముప్కాల్‌లో ..


మెండోరలో ..


డొంకేశ్వర్‌లో..


సిరికొండలో..

'తాగునీటి సమస్య తలెత్తవద్దు'


గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 14:ప్రస్తుత వేసవిని దృష్టిలో పెట్టుకొని నడిపల్లి పంచాయతీ పరిధిలోని డిచ్‌పల్లి, గాంధీనగర్, నడిపల్లి గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని భూగర్భ జలాలు వృధా చేయకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం నడిపల్లి సచివాలయంలో నిర్వహించిన గ్రామ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని తాగునీటి వృధాను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో కిషన్‌రావు, తాజామాజీ సర్పంచ్ సతీష్‌రావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

టీయూలో గ్రూప్-2 పరీక్షకు భారీగా అభ్యర్థులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 14: తెలంగాణ విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాలలో ఐఏసీఈ సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 కానిస్టేబుల్, ఎస్సై పరీక్షలకు పెద్ద సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యారని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు సీనునాయక్ తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం నిర్వహించిన పరీక్షలకు 200 మంది అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు తరలివచ్చారన్నారు. గ్రూప్-2 పరీక్ష ద్వారా తాము ఎన్నో అవకాశాలను నేర్చుకున్నామని అభ్యర్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన శక్తి ప్రతినిధులు లక్ష్మణ్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

అఖండ శివనామ సప్తాహ ప్రారంభం

బోధన్‌రూరల్,ఏప్రిల్14: బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామంలో ఆదివారం 6వ అఖండ శివనామ సప్తాహ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాలలో సప్తాహ నిర్వహించడం వల్ల గ్రామం సుభిక్షంగా ఉంటుందని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు హన్మంత్ రావు, దత్తు పటేల్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు బంటు గంగాధర్, సాయిలు, లచ్చప్ప. మాజీ సర్పంచ్ ప్రకాష్ పటేల్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి పలువురి బీఆర్ఎస్ నాయకుల చేరిక

నందిపేట, ఏప్రిల్14:: నందిపేట, డొంకేశ్వర్ మండలాలకు చెందిన సుమారు 50 మంది మాజీ ప్రజా ప్రతినిధులు, 100మంది నాయకులు, కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. భారత రాష్ట్ర సమితి పార్టీని వీడిన ప్రజా ప్రతినిధులకు, నాయకులకు మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి పార్టీ కండువాలు వేశారు. ఆర్మూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పొద్దుటూరి వినయ్‌రెడ్డి ఆద్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన డీసీసీబీ మాజీ డైరెక్టర్ లోక హన్మాండ్లు, ఐలాపూర్ సొసైటీ చైర్మెన్ లక్ష్మినారాయణ, మాజీ సర్పంచ్‌లు చిట్టేడి భోజా రెడ్డి, కుర్మె దేవన్న, తోట గణేష్, గుద్దేటి హరిదాస్, గంగారాం, బట్టు సంజీవ్, మంగ్లారపు ధర్మన్న, నా యకులు నాయకుడు చందు, సంతోష్ రెడ్డి, తధితరులు ఉన్నారు. వారికి కండువా వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్లు వరకు కరెంట్ బిల్లు మాఫీ, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి గ్యారంటీలకు ఆకర్శితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ప్రకటిం చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహి పాల్, డీసీసీ ఉపాధ్యక్షులు పెంట ఇంద్రుడు, తధితరులు ఉన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

ముప్కాల్, ఏప్రిల్14: బాల్కొండ మండల విశ్వబ్రహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా సుంకం శ్రీనివాస్, ఉపాధ్యక్షునిగా మండలోజి రాంకిషన్, జనరల్ సెక్రెటరీ అకోజీ సుధాకర్, వైస్‌జనరల్ సెక్రెటరీ మండాజీ మారుతి, కోశాధికారి మండోలోజు హన్మాండ్లు, సలహదారులుగా కోటగిరి అంజయ్య, సుంకం దామోదర్, శ్రీపాద తుకారం, అకోజీ సుబాష్, కోటగిరి రమేష్, వీడీసీ మెంబర్ కత్రాజీ పాపయ్య, గ్రామ పెద్దమనిషి కోటగిరి అంజయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు.విశ్వబ్రహ్మణ సంఘం బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 14: నేడు నగరంలోని దుబ్బ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని నగర టౌన్-2 ఏడీఈ తోటరాజశేఖర్ తెలిపారు. నగరంలోని దుబ్బ, పవన్‌నగర్, సంజీవయ్య కాలనీ, అంబేద్కర్ కాలనీ, కేసీపీ మెట్రో వెనక ప్రాంతం, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఉదయం 9 నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రూ.60 లక్షలతో చర్చి పునర్ నిర్మాణం'

డిచ్‌పల్లి, ఏప్రిల్ 14: డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బి) క్యాథలిక్ చర్చి పునఃనిర్మాణం కోసం 60లక్షలు వెచ్చించి నూతన చర్చి నిర్మాణాన్ని చేపట్టే విధంగా క్రైస్తవులంతా కలిసి మెలసి ఉండటం ఎంతో ఆనందంగా ఉందని బిషప్ అంటోని అన్నారు. ఆదివారం డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బి) నూతన క్యాథలిక్ చర్చిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు

ఖిల్లా,ఏప్రిల్,14:నగరంలోని ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆటోనగర్‌కు చెందిన అజ్జుఅనే వ్యక్తిపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు తెలిపారు.ఆటోనగర్‌లో నివాసముంటున్న సునార్‌అంజత్ అనేవ్యక్తి ఇంటికి అజ్జువెళ్లి దాడిచేయడానికి యత్నించాడని బాధితుడు ఫిర్యాదుచేసినట్లు తెలిపారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నమన్నారు.

నూతనంగా ఎన్నికైన సర్వసమాజ్ సభ్యులకు సన్మానం

ఆర్మూర్‌టౌన్ , ఏప్రిల్14: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి గ్రామ సర్వ సమాజ్ సభ్యులుగా ఎన్నికైన సభ్యులను పలువురు ఘనంగా సన్మానించారు. ఇటీవల నూతన సర్వసమాజ్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆకుల లక్ష్మణ్, భూమేని నవీన్, సాంబరి శ్రీనివాస్, సాజిద్, సిరిపురం రాజన్నలను అభినందించి పట్టుశాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు ఆకుల రాము, రవిగౌడ్, లింబాద్రి, కాశీరాం, శ్యామ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది

● రైతులు అధైర్య పడొద్దు : ఎమ్మెల్యే భూపతిరెడ్డి


గన్నారంలో ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఇందల్వాయి, ఏప్రిల్ 14: రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు ఎవరూ అధైర్యపడవద్దని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. ఆదివారం ఇందల్వాయి మండలంలోని గన్నారం గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులు ఎవరై అధైర్యపడవద్దని ప్రభుత్వం ద్వారా చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు. అకాల వర్షంతో ధాన్యం తడిచి రైతులు ఇబ్బందులు ఎదర్కొంటున్నారని తడిసిన ధాన్యంతో పాటు రంగు మారిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని అన్నారు. రైతులకు కడత పేరుతో ధాన్యంలో కోత విధిస్తే సహించేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సొసైటీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, వైస్ చైర్మన్ మారుతి, సొసైటీ డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని ఎన్నికల్లో గెలిపించాలి

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని ఒక్కోక్కటిగా తప్పకుండా అమలు చేస్తుందని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి చేతిగుర్తుకు ఓటువేసి ఎంపీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పార్లమెంట్ ఎన్నికల సమావేశంలో భాగంగా ఇందల్వాయి మండల కేంద్రంలోని గంగపుత్ర సంఘంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుండి పెద్ద ఎత్తున బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుండి కార్యకర్తలు ఎమ్మెల్యే భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలంలోని మిట్టపల్లి గ్రామంలో పద్మశాలి ఐక్యత తనను ఎంతగానో ఆకట్టుకుందని ఆ సంఘ సభ్యుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గ్రామానికి చెందిన వంద మంది పద్మశాలి సంఘ ప్రతినిధులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్ ఆధ్వర్యంలో కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పద్మశాలి సంఘ ప్రతినిధులకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని జిల్లా కేంద్రంలో కూడా పద్మశాలి సంఘ భవనానికి ఇటీవలే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ఒత్తిళ్లు ఉండటం వల్ల దొంగ కేసులు పెట్టారని కాంగ్రెస్ హయాంలో అలాంటి కేసులకు ఆస్కారం లేదన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ కుట్రలను తిప్పి కొట్టాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రాహుల్‌గాంధీ ప్రకటించిన ఐదు గ్యారంటీలను తప్పక అమలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘ ప్రతినిధులు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు కంచెట్టి గంగాధర్, అబీబ్‌ఖాన్, వడ్ల గంగాధర్, ముప్పగంగారెడ్డి, శేఖర్‌గౌడ్, మునిపల్లి సాయిరెడ్డి, డాక్టర్ షాదుల్లా, పాల్గొన్నారు.

యువతిని మోసం చేసిన యువకుడిపై కేసు నమోదు

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్, 14: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనను దారుణంగా మోసం చేశాడంటూ ఓ యువతి పోలీసులను ఆశ్రయించింది. ఆ యువకుడిపై రూరల్ పోలీసు అధికారులు ఎట్టికేలకు కేసు నమోదుచేశారు. బాదితురాలు తెలిపిన ప్రకారం.. నిజామాబాద్ రూరల్ మండలం ఆకుల కొండూరు గ్రామానికి చెందిన నాశెట్టి దీపక్ అనే యువకుడు అదే గ్రామంలో తన ఇంటి సమీపంలో ఉండే ఓ యువతి (మాదస్తు విఘ్నేశ్వరి)తో స్నేహం చేశాడు. ఇద్దరూ డిగ్రీ చదివినవారే. హైదరాబాద్ మారెడ్‌పల్లి అపోలో ఆసుపత్రికి చెందిన ఫార్మాలో ఇద్దరూ ఉద్యోగం చేశారు. ఆ క్రమంలో ఇద్దరూ కలిసి సన్నితంగా మెదిలారు. తర్వాత బల్కంపేట ఆలయంలో వివాహం చేసుకున్నారు. వీరి వ్యవహారం దీపక్ కుటుంబసభ్యులకు తెలిసి ఇద్దరిని బెదిరించారు. యువతిపై భౌతిక దాడిచేసినట్లు యువతి తెలిపింది. సదరు యువతి తన స్వగ్రామానికి తిరిగి వచ్చి దీపక్ తనను వివాహం చేసుకున్నాడని, తద్వారా తాను గర్భం దాల్చిన విషయం సైతం పెద్దలకు తెలిపింది. దీపక్‌ను పిలిచి విచారిస్తే తాను ఆ యువతిని వివాహం చేసుకోనని, తనకు ఇష్టంలేదని తెలిపాడు. దాంతో దీపక్ తనను దారుణంగా మోసం చేశాడని, న్యాయం చేయాలని సదరు యువతి రూరల్ పోలీసులను ఆశ్రయించింది. రూరల్ పోలీసు స్టేషన్ స్పెషల్ ఆఫీసర్, ట్రైనీ ఐపీఎస్ అధికారిణికి సైతం వివరించింది. తనకు న్యాయం కావాలని 15 రోజులుగా పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతోంది. దీపక్ ఉన్నతస్థితిలో ఉండటం, తన పలుకుబడితో రాజకీయ నేతలతో పోలీసులపై ఒత్తిడితెస్తుండటంతో పోలీసులు సైతం న్యాయం చేయడం లేదని వాపోయింది. విషయం తెలిసిన ఓ మహిళా సమాఖ్య యువతికి మద్దతు తెలిపింది. ఈనెల 13న జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించింది. సాక్షాలు సైతం బయటపెట్టింది. దాంతో రూరల్ పోలీసులకు దీపక్‌పై కేసు నమోదుచేయక తప్పలేదు. చివరకు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులతోపాటు 420, 417 సెక్షన్‌ల కింద కేసు నమోదుచేసినట్లు ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.170	రూ.300	రూ. 320
వెన్‌కాబ్(కిలో)	రూ.175	రూ.305	రూ. 325

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.75,500	రూ.69,400	రూ.870

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మైదాన్ (హిందీ) (9.15)
: ఫ్యామిలీ స్టార్ (1.05, 10.30)
: టిల్లు స్క్వేర్ (4.30, 7.30)
స్క్రీన్-2 : బడే మియాన్ చోటే మియాన్ (తెలుగు) (10.00, 7.05)
: గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (తెలుగు) (1.30)
: గీతాంజలి మళ్లీ వచ్చింది (4.05)
: బడే మియాన్ చోటే మియాన్ (హిందీ 3డీ) (10.35)
స్క్రీన్-3 : లవ్‌గురూ (1.10, 7.15)
: డియర్ (4.20)
: గీతాంజలి మళ్లీ వచ్చింది (10.25)
స్క్రీన్-4 : మైదాన్ (హిందీ) (12.00)
: మంజుమ్మల్ బాయ్స్ (3.50, 6.35)
: లవ్ గురూ (10.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : గీతాంజలి మళ్లీ వచ్చింది (10.40)
: టిల్లు స్క్వేర్ (1.30, 10.40)
: ఫ్యామిలీ స్టార్ (4.20, 7.30)
స్క్రీన్-2 : మంజుమ్మల్ బాయ్స్ (11.00)
: గీతాంజలి మళ్లీ వచ్చింది (1.30, 7.35)
: బడే మియాన్ చోటే మియాన్ (హిందీ) (4.30, 10.20)
స్క్రీన్-3 : మంజుమ్మల్ బాయ్స్ (1.40, 4.30, 7.50, 10.35)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : ఫ్యామిలీ స్టార్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : బడే మియాన్ చోటే మియాన్ (హిందీ) (11.00, 6.00)
: మైదాన్ (హిందీ) (2.00, 9.00)
విజయ్ : గీతాంజలి మళ్లీ వచ్చింది (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్